# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 316: సాధన ఎందుకు చేయాలి?
# ఏప్రిల్ 20, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 2, పేజీలు 221-227 నుండి తీసికొనబడినవి

స్వామి! మా నిత్యజీవితంలో సాధన అత్యవసరమా? తప్పని సరిగా చేయాలా?

భగవాన్: అవును, రోజు సాధన చేయాలి. శుభ్రంగా ఉండటానికి గిన్నెలు రోజు కడుగుతున్నారు కదా? భక్తి శ్రద్ధలు స్థిర పడి సర్వస్య శరణాగతి అనే స్థితికి వచ్చేంత వరకు రోజు సాధన చేయడం అత్యవసరం.

ధాన్యపు చేలకి రోజు నీరు పెట్టకపోతే కాపు ఎండిపోతుంది. కానీ నీలగిరితైలము, రావి, వేప వంటి పెద్ద చెట్లకి రోజు నీరు పెట్టక్కరలేదు. ఎందుకు? వాటి వేర్లు భూమి లోతులకి పారి అక్కడినుండి నీరు, ఆహారము పీల్చుకుంటాయి. చిన్న మొక్కలకి రోజు నీరు కావాలి కానీ పెద్ద చెట్లకి రోజు నీరు పెట్టక్కరలేక పోవడం విచిత్రంగా అనిపించవచ్చు. చిన్న మొక్కల వేర్లు కొన్ని అంగుళాలు మాత్రమే భూమిలోకి పాకగలవు. కానీ పెద్ద వృక్షాల వేర్లు అన్ని వైపులకి, లోతుగా విస్తరించి భూగర్భం లోంచి నీరు అందుకుంటాయి. అదే విధంగా మీ భక్తి నమ్మకాలు మీ హృదయమనే భూమిలోకి లోతుగా వెళ్ళేంత వరకు రోజు సాధన చేయాలి. మీ భక్తి నమ్మకాలు ఈ రోజు ఒక చిన్న మొక్క వేర్ల వలె మీ హృదయం లోతులకి వెళ్ళలేదు. అందుచేత మీరు రోజు సాధన చేయాలి.

స్వామి! సాధన గురించి ఎంతో నొక్కి వక్కాణించి చెప్తారు కానీ సాధన చేయడానికి మాకు చాలా కష్టంగా ఉంటుంది. దీనికి పరిష్కారం ఏమిటి?

భగవాన్: జీవితంలో ఏది సాధించాలనుకున్నా దానికి సాధన కావాలి. నడవడానికి, మాట్లాడడానికి, చదవడానికి, తినడానికి, వ్రాయడానికి, అన్నిటికీ సాధన కావాలి. ఒక బిడ్డ నడవడం ఎలా నేర్చుకుంటుంది? సాధన వల్లనే. గాయకులు ఎంతో సాధన చేస్తారు. కారు నడపాలంటే సాధన చేయాలి. స్టీరింగు ఒక చోటుంటే, బ్రేకు ఇంకో చోటుంటే, క్లచ్ మరో చోటుంటుంది. కానీ సాధన చేసి ఆ కారుని నడపడం నేర్చుకుంటారు. అదే విధంగా ఆధ్యాత్మికంలో కూడా సాధన అవసరం.

స్వామి! ఆధ్యాత్మిక మార్గంలో గురువు యొక్క పాత్ర ఏమిటి?

భగవాన్: గురువు పైన మనకి పూర్తి నమ్మకం ఉండాలి. ఉదాహరణకు, నీకు పట్టణములో వనభోజనానికి వెళ్ళాలని ఉందనుకో. కానీ ఆ పట్టణమునకు ఎప్పుడూ వెళ్లకుంటే అక్కడ ఎటు వెళ్ళాలో ఏమి తెలియదు. అందుకని దారి చూపడానికి ఒక గైడ్ ని పెట్టుకుంటావు. నీకు ఆ ఊరు కొత్త కాబట్టి ఆ గైడ్ ని ఏమి ఎదురు ప్రశ్నలు వేయవు. అదే విధంగా ఎంతో జ్ఞానం ఉన్న గురువును జాగ్రత్తగా అనుసరించాలి. ఏ విషయంలోనూ ఎదురు ప్రశ్నలు, సంశయాలు ఉండకూడదు.

రోడ్డుల కూడలిలో దారులు చూపించడానికి బోర్డులు ఉంటాయి. మీరు వెళ్ళాల్సిన ఊరికి ఆ బోర్డు మీద చూపిన దిశలో వెళ్తే మీ గమ్యానికి చేరతారు. ఆ బోర్డు మిమ్మలను ఎత్తి తీసుకెళ్ళదు కదా. ఆ బోర్డు చూపిన

దారిలో మీరే వెళ్ళాలి. అదే విధంగా గురువు మీకు ఆధ్యాత్మిక మార్గం చూపుతాడు. ఏమేమి పాటించాలో వివరించి చెప్తాడు. కానీ గమ్యం చేరడానికి మీరే కష్టపడాలి. మీ తరపున ఇంకొకరు చేయలేరు.

'గురు' అనే రెండు అక్షరాల పదానికి రెండు అంతరార్థాలున్నాయి. 'గు' అంటే అంధకారం (అజ్ఞానము). 'రు' అంటే ప్రకాశం (జ్ఞానము). రెండో విధంగా చూస్తే 'గు' అంటే గుణాతీత, గుణాలకి అతీతం. 'రు' అంటే రూపవర్జిత, రూపం లేనిది. గురువు గుణాతీతమైన, రూపవర్జితమైన దైవత్వం గురించి బోధించేవాడు. నిజమైన గురువు తన శిష్యుల మేలు కోరే వాడు. వారికి హితమైనవి చెప్పే వాడు, ఇష్టపడేవి చెప్పే వాడు కాదు. నిజమైన శిష్యుడు గురువును ఎదురు చెప్పకుండా అనుసరించేవాడు.

స్వామి**!** సాధన చేసిన ఫలితాలు తొందరగా రావడం లేదనిపిస్తుంది**.** మేము అనుకున్న దాని కంటే ఆలస్యం కనిపిస్తుంది**.** ఏమంటారు స్వామి**?**

భగవాన్**:** మీకు సాధన అంటే సరి అయిన అవగాహన లేదు. ఈ లోకంలో చిన్నప్పుడే చదువు మొదలు పెడతారు. ప్రైమరీ స్కూలు, సెకండరీ స్కూలు, తర్వాత కాలేజీ, ఆ తర్వాత యూనివర్సిటీ. ఇలాగ పదిహేను ఏళ్ళు బాగా కష్టపడితే డిగ్రీ వస్తుంది. అంటే ఆ డిగ్రీ కొరకు ఎంత కష్టపడ్డారు? ఆ డిగ్రీ రావడానికి చాలా సమయమే పట్టింది కదా? ఒక డిగ్రీ కొరకు, జీవనోపాధి కొరకు ఇంత కష్టపడతారు. మరి నిత్యసత్యమైన భగవంతుని అనుగ్రహం కొరకు ఇంకెంత కష్టపడాలి? మీరే ఆలోచించుకోండి. సాధనలో వెంటవెంటనే ఫలితాలు దొరకాలనుకోవడము పొరపాటు.

స్వామి**!** మా ధ్యానం మిమ్మల్ని సంతృప్తి పరుస్తుందా**?**

భగవాన్**:** మీరు చేసేది ధ్యానం అంటారా? లేదు, సరిగ్గా చేయడం లేదు. ఇంకేమైనా అయి ఉండవచ్చేమో కానీ ధ్యానం కాదు. ధ్యానానికి కూర్చుంటారు, కానీ మీ మనసు బజారులో ఉంటుంది, లేదా భోజనానికి ఏమి తిందామా అని ఆలోచిస్తుంటారు. లేక మీ ధోబీ ఇస్త్రీ బట్టలు ఎప్పుడు తెస్తాడా అని. ఇదా ధ్యానము? కాదు కాదు.

ఒక చిన్న ఉదాహరణ. మీరిక్కడ కూర్చొని స్వామి ఎప్పుడెప్పుడు వస్తారా అని ఎదురు చూస్తున్నారు. ఒక చిన్న కారు శబ్దమైనా స్వామి వచ్చారేమో అని శ్రద్ధగా వింటారు. మీ మనసు పూర్తిగా స్వామి పై ఉండి ప్రతి విషయమూ స్వామి రాక అనే దృష్టితో చూస్తుంటారు కదా? అలా కాకుండా మీ మనసు ఇతర విషయాలపై ఉంటే స్వామి మీ ఎదురుగా వచ్చి నుంచున్నా పట్టించుకోరు.

కనుక ధ్యానంలో మీ ఏకాగ్రత పూర్తిగా భగవంతుని పై ఉంచాలి. మనసు స్థిరంగా నిశ్చలంగా ఉండాలి. చలించని మనసు భ్రమించని దృష్టి ఉండాలి.

స్వామి**!** ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించడానికి సాధన చేయడానికి ఏమేమి నేర్చుకోవాలి**?** ఏ గ్రంథాలతో మొదలు పెట్టాలి**?**

భగవాన్**:** ఎన్నెన్నో విషయాలు, వివరాలు ఏమి అక్కరలేదు. ఎంతో మంది పుస్తకాలు చదువడం చూస్తుంటాము. ఏళ్ల తరబడి ఉపన్యాసాలు వింటుంటారు. కానీ ఏమి ప్రయోజనం? ఆధ్యాత్మిక మార్గంలో ఎక్కడ ఉన్నారో అక్కడే ఉంటారు. ఎందుకంటే సాధన చేయలేదు కనుక వారు వెనుక బడుతున్నారు. ఎన్నో

పుస్తకాలు, గ్రంథాలు ఏమీ చదువనక్కరలేదు. ఎన్నెన్నో విషయాలు తెలుసుకోనక్కరలేదు. ఒక్క విషయాన్ని క్షుణ్ణంగా నేర్చుకుంటే అంతే చాలు. ఒక్క దాన్ని సాధన చేస్తే అంతే చాలు. అన్నీ నేర్చుకొని ఒక్కటీ సాధన చేయకుంటే ఏమి ప్రయోజనం? ప్రాణం తీసుకోడానికి ఒక్క ముల్లో, సూదో చాలు. కానీ ఇతరులను చంపడానికి పిస్టల్ కానీ కత్తి కానీ అవసరం. అదే విధంగా ఇతరులకు బోధించడానికి ఎన్నో విషయాలు నేర్చుకోవాలి, ఎన్నో పుస్తకాలు చదవాలి. కానీ మీ మోక్షానికి ఒక్క దాన్ని శ్రద్ధగా సాధన చేస్తే అంతే చాలు. కనుక చదవడం, నేర్చుకోవడం కంటే సాధన చేయడం ముఖ్యం.

స్వామి**!** మీ ఉపదేశములు వినగలగడం మా భాగ్యం**.** విచారణ అంటే ఏంటో మాకు ఇప్పుడు అర్థమైంది**.** కానీ అది సాధన ఎందుకు చేయలేక పోతున్నాను**?** నా మనసు స్థిరంగా ఉండదెందుకు**?** చలించడం అనేది మనసు యొక్క లక్షణమా**?**

భగవాన్**:** నీ మనసు స్థిరంగా లేదని, ఏకాగ్రత కుదరడం లేదని అంటుంటావు. అది తప్పు. నిజానికి మనసు అనేదే లేదు. మనసు అంటే ఒక కోరికల మూట. తలపుల మోపు. దారాలు దగ్గరగా నేసిన వస్త్రం వంటిది. ఒకొక్క దారాని విడదీస్తే వస్త్రమనేదే ఉండదు. అదే విధంగా కోరికలను అణచి, తలపులను నిగ్రహించుకుంటే మనసు అనేది ఉండదు. దీనినే అమనస్కం లేక మనోలయం అంటారు.

వచ్చే వారం మరిన్ని స్వామి ఉపదేశాలతో మళ్ళీ కలుద్దాం.

ఓం శ్రీ సాయి రామ్**!**